క్లుప్తంగా

మత్తుకు చిత్తు కావద్దు


మాట్లాడుతున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: గ్రామీణ ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ విజయ్‌కుమార్ అన్నారు. మోఘవరం పంచాయతీ పరిధి జక్కరపేట గ్రామంలో సోమవారం రాత్రి సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తుకు అలవాటుపడి జీవితాలను చిత్తు చేసుకోవద్దన్నారు. గిరిజనులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నాటు సారా తయారు చేయరాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

కేంద్ర పథకాలను ప్రజలకు చేరువ చేయాలి

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.తేజేశ్వరరావు అన్నారు. టెక్కలిలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పి.తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జి విజయానందరెడ్డి, నాయకులు పి.వేణుగోపాల్, ఎస్.ఉమామహేశ్వరి, బి.మహేశ్వరరావు, ఎన్.లక్ష్మీనారాయణ, బి.నరేంద్ర, ఎస్.నాగరత్నం, జె.పరమేశ్వరరావు, డి.రాజ్‌కుమార్, జె.రామ్‌జీ పాల్గొన్నారు.

50 కుర్చీల వితరణ

కంచిలి: మండలంలోని ఎస్.ఆర్.సి.పురం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం సోంపేట రోటరీ క్లబ్ వారు 50 కుర్చీలను వితరణగా ఇచ్చారు. వీటిని క్లబ్ అధ్యక్షుడు చలపతిరావు, సెక్రటరీ శివాజీ, ట్రెజరర్ వెంకటరమణ, సీనియర్ సభ్యులు టంకాల బాబు చేతులమీదుగా హెచ్‌ఎం పొల్లాయి ముకుందరావుకు మంగళవారం అందజేశారు. చేతులు కడుక్కునే చోట ఎండపడకుండా షెడ్డు నిర్మిస్తామని రోటరీ సభ్యులు హామీ ఇచ్చినట్లు హెచ్‌ఎం తెలిపారు. ఉపాధ్యాయుడు లక్ష్మణరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కొల్లి కుమారి పాల్గొన్నారు.

ఎరుకుల రామాయణంపై పత్ర సమర్పణ


విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న కూర్మారావు

పలాస: తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఈ నెల 8, 9, 10 తేదీల్లో జానపద విజ్ఞాన సదస్సు జరిగింది. ఇందులో పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన రచయిత, జానపద పరిశోధకుడు బద్రి కూర్మారావు పాల్గొని అంతరించుపోతున్న జముకుల కథ, ఎరుకుల రామాయణంపై పత్ర సమర్పణ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక, పంజాబ్ తదితర రాష్ట్రాల నుంచి జాన పద విజ్ఞాన శాస్త్ర వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూర్మారావు 20 ఏళ్లుగా జానపద కళాపీఠం ద్వారా చేస్తున్న సేవలను అభినందిస్తూ ఆయన్ని సన్మానించారు. త్వరలో ఉత్తరాంధ్రలో తెలుగు రాష్ట్రాల జానపద ప్రాంతీయ సదస్సును ఏర్పాటు చేయడానికి సహకారం అందజేస్తామని నిర్వాహకులు హామీ ఇచ్చారని కూర్మారావు తెలిపారు.

నీటి సమస్యపై దృష్టిసారించాలి

ఇచ్ఛాపురం: వేసవి నేపథ్యంలో మంచినీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు దృష్టిసారించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి సూచించారు. ఇంజినీరింగ్ విభాగం అధికారులతో మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో కాలువలు, రోడ్లు, విద్యుత్ దీపాల గురించి అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్యను అధిగమించడానికి బాహుదానదిలో రూ. రెండు లక్షలతో ఎర్త్‌బండ్ నిర్మాణం, 1, 2, 3 వార్డుల ప్రజలకు నీటి ఇబ్బందుల్లేకుండా రెండు ట్యాంకర్లతో రోజూ పది ట్రిప్పుల చొప్పున మంచి నీటిని సరఫరా చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే బోర్ల మరమ్మతుల కోసం రూ.నాలుగు లక్షలతో సామగ్రిని తీసుకొచ్చామని ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర పాల్గొన్నారు

మున్సిపల్ కమిషనర్ పర్యటన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. 18వ వార్డు ఎల్‌ఐసీ ఆఫీస్ ఎదురుగా గల రోడ్డు స్వీపింగ్ పనులను పరిశీలించారు. 15వ వార్డు నెహ్రూనగర్ డిగ్రీ కాలేజ్ రోడ్డు స్వీపింగ్ ప్రక్రియపై శానిటేషన్ సిబ్బందికి సూచనలు చేశారు. 21వ వార్డు బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్ వద్ద గార్బేజ్ పాయింట్‌ను పరిశీలించి తక్షణమే తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. రెండో వార్డు ఇంగిలిగాంలోని డంపింగ్ యార్డు పరిశీలించారు. చెత్త నిర్వహణను, యార్డ్ పరిస్థితిని క్షేత్ర స్థాయిలో తనిఖీ చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియలను కొనసాగించాలని కోరారు. కాశీబుగ్గ ఓల్డ్ బస్టాండ్ రోడ్లో ఉన్న అన్న క్యాంటీన్ తనిఖీ చేశారు. శానిటేషన్ సూపర్‌వైజర్లు సత్య, శ్రీను ఉన్నారు.

హామీలకే పరిమితం!

- గ్రోయిన్ల నిర్మాణానికి రూ.21 కోట్లు
- ఈదుపురం ఎత్తిపోతల పథకానికి రూ.9 కోట్లు కేటాయిస్తున్నట్టు చెప్పిన సీఎం చంద్రబాబు
- నాలుగు నెలలైన విడుదలకాని నిధులు


ఎండిపోయిన బాహుదానది


నిరుపయోగంగా ఈదుపురం ఎత్తిపోతల పథకం

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులను అడుగడుగునా మోసం చేస్తున్నారు. గత ఏడాది నవంబర్ ఒకటో తేదీన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభానికి ఇచ్ఛాపురం మండలం ఈదుపురం గ్రామానికి వచ్చిన ఆయన పలు హామీలు ఇచ్చారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చెప్పుకొచ్చారు. బహుదానది పరివాహక ప్రాంతంలోని 11 గ్రోయిన్ల పునరుద్ధరణ, మూలకు చేరిన ఈదుపురం ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు మొత్తం రూ.30 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. అయితే నాలుగు నెలలైనా పనుల కోసం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.

మూలకు చేరిన ఎత్తిపోతల పథకం

ఇచ్ఛాపురం మండలం కొఠారీ, పూర్ణాటకం, పత్రిపుట్టుగ, ధర్మపురం, కవిటి మండలం భైరిపురం, వింధ్యగిరి, రాజపురం, లండారిపుట్టుగ గ్రామ పరిధిలో ఉండే 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించే ఏకైక ఎత్తిపోతల పథకం జై కిసాన్ ఎత్తిపోతల పథకం. ఈదుపురం బాహుదానది చెంతన ఉన్న ఈ పథకాన్ని 2004లో నిర్మించారు. ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా ఉన్న గ్రామాల్లోని రైతులు రబీ, ఖరీఫ్ సీజన్‌లో సాగునీటికి కష్టాలు లేకుండా పంటలను పండించుకునేవారు. 2009లో కురిసిన వర్షాలకు బాహుదా నదికి వరద రావడంతో ఎత్తిపోతల పథకం నీట మునిగి పరికరాలు మరమ్మతుకు గురయ్యాయి. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కొంత మేర నిధులు మంజూరు చేయడంతో మరమ్మతులు చేపట్టడంతో మరో ఐదేళ్ల వరకు రైతులకు సాగునీటి సమస్య లేకుండా పోయింది. 2016లో కొఠారీ ఉమ్మాడి చెరువు వద్ద పైపు లైన్ పూర్తిగా ధ్వంసం కావడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందకుండా పోయింది. 2018 అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు ఎత్తిపోతల పథకం యంత్రాలు సుమారు 15 రోజులు నీటిలో ఉండి పోవడంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫారమ్‌తో సహా పూర్తిగా మరమ్మతుకు గురయ్యాయి. అప్పటి నుంచి ఈదుపురం ఎత్తిపోతల పథకాన్ని అధికారులు, పాలకులు విస్మరించారు.

మరమ్మతుకు నోచుకోని 11 ఓపెన్ హెడ్ చానెళ్లు

ఇచ్ఛాపురం మండలం, మున్సిపాలిటీలో ఉన్న ఆరువేల ఎకరాలకు సాగునీరు అందివ్వాలంటే శిథిలావస్థకు చేరుకున్న 11 ఓపెన్ హెడ్ చానెళ్లను పునరుద్ధించాలని రైతులు కోరుతున్నారు. 2018లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు 11 గ్రోయిన్స్ పూర్తిగా కొట్టుకుపోవడంతో రైతులకు కష్టాలు మొదలయ్యాయి. బహుదానది నుంచి సాగునీటిని గ్రోయిన్ల ద్వారా పంట పొలాలకు మళ్లించి ఖరీఫ్, రబీలో పంటలను దర్జాగా పండించేకునేవారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం వీటిని పునరుద్ధించకపోవడంతో 2019 తర్వాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన పిరియా విజయ స్వయంగా జిల్లా ఇరిగేషన్ అధికారులతో కలసి గ్రోయిన్లు పరిశీలించి రూ.17 కోట్లతో అంచనాలు వేశారు. ఏడాదిన్నర క్రితం రూ.28 లక్షలతో ఈదుపురం బహుదానది వద్ద తాత్కాలికంగా కేశుపురం న్యూ గ్రోయిన్ నిర్మించారు. అనంతరం ఎన్నికలు రావడంతో మిగిలిన పది గ్రోయిన్ల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ క్రమంలోనే నవంబర్‌లో ఈ ప్రాంతానికి వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి ఓపెన్ హెడ్ చానెళ్ల పునరుద్ధరణ విషయాన్ని స్థానిక రైతులు తీసుకువెళ్లగా... స్పందించిన ఆయన రూ.21 కోట్లు మంజూరుకు హామీ ఇచ్చారు. అయితే ఒక్క రూపాయి కూడా విడుదల కాకపోవడంతో పనులు ప్రారంభిస్తారన్న అన్నదాతల ఆశలు అడియాసలయ్యాయి.

గ్రోయిన్ల స్థానంలో లిఫ్టులు బెస్ట్



బహుదానదిలో పూర్తిగా ఇసుకను తరలించడం ద్వారా నదీ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. ప్రస్తుతం ఉన్న గ్రోయిన్లకంటే నది దిగువ స్థాయిలో ఉంది. ఈ పరిస్థితిలో గ్రోయిన్‌లు నిర్మించడం ద్వారా రైతులకు పెద్దగా ప్రయోజనం చేకూరదు. గ్రోయిన్ల స్థానంలో లిఫ్టులు ఏర్పాటు చేయడం మంచింది. దీని వల్ల అవసరమైన నీటిని సంబంధిత పంట పొలాలకు అందించవచ్చు. ప్రభుత్వం పునరాలోచించి రైతులకు ప్రయోజనం చేకూర్చాలి.

– బోర పుష్ప, ఎంపీపీ, ఇచ్ఛాపురం

అంచనాలు వేశాం

ఇచ్ఛాపురం రైతులకు గ్రోయిన్లు తప్పని సరి. ఇటీవల జిల్లా చీఫ్ ఇంజినీర్ డి.రాంగోపాల్, ఎస్ఈ వూనా కృష్ణారావులు వచ్చి మరమ్మతులకు గురైన 11 గ్రోయిన్లను పరిశీలించి అంచనాలు వేశారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించడం జరుగుతోంది. నిధులు కేటాయింపు తరువాత పనులు ప్రారంభిస్తాం.

– మధుసూదన పాణిగ్రాహి, ఏఈ, ఇరిగేషన్, ఇచ్ఛాపురం

అంచనాలతో కాలక్షేపం



గతంలో అధికారంలో ఉండే సమయంలో టీడీపీ ప్రభుత్వం అంచనాలతో కాలయాపన చేసింది. ఇప్పుడు సాక్షాత్ ముఖ్యమంత్రి చంద్రబాబు వరం ఇచ్చినప్పటికీ పనుల్లో కదలికలు లేవు. రబీ సీజన్‌లో పనులు మొదలు పెడితే ఖరీఫ్ నాటికి రైతులకు ప్రయోజనం చేకూరుతోంది. ప్రభుత్వం ఆ దిశగా పనులు మొదలు పెట్టాలి.

– గుజ్జు ఢిల్లీరావు, సర్పంచ్, కేశుపురం

గరిమెళ్లకు ఘననివాళి



టీటీడీ ఆస్థాన కళాకారుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ మరణం తీరని లోటని వక్తలు అన్నారు. సోంపేట పట్టణంలోని కోదండరామస్వామి దేవాలయం ఆవరణలో బాల కృష్ణ ప్రసాద్ సంతాప కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత నిమ్మన పురుషోత్తం శిష్యబృందం సభ్యులు గరిమెళ్ల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గరిమెళ్లను స్మరిస్తూ గాత్రకచేరి నిర్వహించారు. కార్యక్రమంలో కళాకారులు సి.మోహనరావు, గోవిందు, టి.లక్ష్మీనారాయణ, రాంబాబు, జనని, హిందు పాల్గొన్నారు. –సోంపేట

రూ. 41 వేల ఆర్థికసాయం



కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించేందుకు మేమున్నాం అంటున్నారు పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం సభ్యులు. ఇచ్ఛాపురం మండలం కొఠారీ గ్రామానికి చెందిన వెంకటరావు రాళో స్థానిక శివాలయంలో అర్చకత్వం చేస్తున్నాడు. ఏడాది నుంచి రెండు కళ్లు కనిపించడం లేదు. కుమారుడు సురేంద్ర దివ్యాంగుడు. భార్య విష్ణమ్మ కిడ్నీ వ్యాధితో నెల రోజుల క్రితం మృతి చెందడంతో కుటుంబం వీధిన పడింది. విషయం తెలుసుకున్న పోలెండ్ శ్రీకాకుళం తెలుగు సంఘం సభ్యులు రూ. 41 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి మంగళవారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. సంఘ సభ్యులు తిప్పన శేఖర్, నైనా శ్యామ్, పూర్ణచంద్ర, గ్రామ పెద్ద సహదేవ్‌రెడ్డి ఉన్నారు. –ఇచ్ఛాపురం రూరల్

వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

టెక్కలి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం టెక్కలిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలకు నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. ఉదయం 7.30 గంటలకు పార్టీ కార్యాలయానికి హాజరు కావాలన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం పార్టీ జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలో జరగనున్న యువత పోరు కార్యక్రమానికి వెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

భూములకు రక్షణ కల్పించాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు

కవిటి (ఇచ్ఛాపురం రూరల్): ప్రభుత్వ భూములను టీడీపీ నాయకులు ఆక్రమించుకున్నారని.. వారి నుంచి భూములకు రక్షణ కల్పించాలని గొర్లెపాడు గ్రామస్తులు కోరారు. గ్రామస్తుల అభ్యర్థన మేరకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జి సాలిన నారాయణస్వామి, ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా కార్యదర్శి పుక్కల్ల ఆరేలమ్మలు గ్రామస్తులతో మంగళవారం సమావేశమయ్యారు. సర్వే నంబర్ 105లోని 6.34 ఎకరాలు గొర్రె గుండం చెరువు, సర్వే నంబర్ 167లోని 3.43 ఎకరాలు సున్నకోల చెరువు, 1.25 సెంట్లు పారి చెరువు, సర్వే నంబర్ 197లోని 2.06 ఎకరాలు పోరంబోకు భూమితో పాటు మంగళవారం సంతలోని కొంత స్థలం, విశ్రాంతి జవాన్‌కు సంబంధించి భూమిని దౌర్జన్యంగా ఆక్రమించారని సర్పంచ్ కరగాన వసంత వల్లభరావు రికార్డులతో కమిటీ బృందానికి సమర్పించారు. ఈ అంశంపై గతంలో 'సాక్షి'లో కథనం ప్రచురితమైందన్నారు. అప్పటి రెవెన్యూ సిబ్బంది ప్రజాభిప్రాయం తీసుకున్నప్పటికీ తమకు న్యాయం జరగలేదని గ్రామ పెద్దలు గురునాథ్, దాలయ్య, రాజారావు, దాసు, గంగయ్య తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరారు.

సమాజ సేవకు అంకితం కావాలి


మాట్లాడుతున్న వెంకటస్వామి

వజ్రపుకొత్తూరు: యువత సమాజ సేవకు అంకితం కావాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ మంత్రి వెంకటస్వామి అన్నారు. పూండిలో సాయివినీత్ విద్యా సంస్థల ప్రాంగణంలో మంగళవారం నిర్వహించిన యువతతరం సేవా సమితి ఐదో వార్షికోత్సవంలో ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాలతో ఎంతో మంది పేదలను, నిరుపేద ప్రతిభ కలిగిన విద్యార్థులను, క్షతగాత్రులను ఆర్థికంగా ఆదుకుని వారిని అక్కున చేర్చుకోవడంలో యువతరం సేవా సమితి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. అంతకుముందు వివిధ మండలాలకు చెందిన ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ప్రతిభ పరీక్ష , డ్రాయింగ్ పోటీలు నిర్వహించి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదు బహుమతులతో పాటు ప్రసంశా పత్రాలు అందించారు. కార్యక్రమంలో విశ్రాంతి డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీల, సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చింత మురళీ, కెంగువ రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు


ఫిర్యాదు బాక్సులను అందజేస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు రూరల్: బాలికల రక్షణ కోసం ప్రతీ పాఠశాలలో సంకల్పం పేరుతో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేస్తున్నట్లు కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు చెప్పారు. గరుడబద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్థానిక ఎస్సై బి.నీహర్‌తో కలిసి చిన్నారులకు వారి రక్షణ, భద్రతపై అవగాహన కల్పించారు. బాలికల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఈ విషయాన్ని కాగితంపై రాసి ఫిర్యాదుల బాక్స్‌లో వేయాలని సూచించారు.

విద్యార్థి దశ కీలకం

వజ్రపుకొత్తూరు రూరల్: ఉజ్వల భవిష్యత్‌కు విద్యార్థి దశ కీలకమని ఎంఈవో వెంకటరావు, అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అక్కుపల్లి ప్రభుత్వ బీసీ గురుకుల పాఠశాలలో టెన్త్ విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను అలవర్చుకొని ముందుకుసాగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ జి.ప్రశాంతి, విశ్రాంతి ప్రిన్సిపాల్ పాపారావు, పాఠశాల కమిటీ చైర్మన్ ధనలక్ష్మి, శ్రీరామ సేవా సంఘం అధ్యక్షులు ఎం.ప్రసాదరావు, సూరాడ మోహనరావు పాల్గొన్నారు.

ఒడియా భాషాభివృద్ధికి కృషి

మందస: మందసలో ఒడియా భాష, సంస్కృతి, విద్య అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర సాహిత్య అకాడమీ ప్రతినిధి పూర్ణచంద్ర మహాపాత్రో కోరారు. స్థానిక ఒడియా యంగ్ మెన్స్ లైబ్రరీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఒడియా భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 1న ఆంధ్ర–ఒడిశా రాష్ట్రాల విభజన సమయంలో గంజాం జిల్లా నుంచి విడిపోయి శ్రీకాకుళం జిల్లా ఆవిర్భవించిందని చెప్పారు. ఉత్తరాంధ్ర ఒడియా మైనారిటీ అసోసియేషన్ నాయకులు దుర్గా ప్రసాద్ పాణిగ్రాహి, సత్యనారాయణ పాడి మాట్లాడుతూ ఒడియా పాఠశాలలను అభివృద్ధి చేసి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

యువత పోరుకు కదలిరండి


సోంపేట: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దాస్ తదితరులు


ఇచ్ఛాపురం టౌన్: పోస్టర్ ఆవిష్కరణలో విజయ, రామారావు


కంచిలి: పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు


నందిగాం: పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు

సోంపేట: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శ్రీకాకుళం కలెక్టరేట్ వద్ద బుధవారం చేపడుతున్న యువతపోరు కార్యక్రమానికి విద్యార్థులు, యువకులు, పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంపీపీ నిమ్మనదాస్ పిలుపునిచ్చారు. సోంపేటలో మండల పార్టీ నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిమ్మన దాస్, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు, మండల పార్టీ అధ్యక్షులు శిలగాన భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులను, నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఎన్నికల్లో నిరుద్యోగులు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ వారిపక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి కూటమి ప్రభుత్వంపై నిరసనగళం వినిపిస్తోందన్నారు. ఈ సందర్భంగా యువతపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు బొమ్మిడి ధర్మరాజు, ఉగ్రపల్లి కృష్ణారావు, జక్కం రమేష్, తేజ పట్నాయక్, తోట ఢిల్లీ, భీమారావు, నెహ్రూ, సతీష్, కొల్ల నారాయణ పాల్గొన్నారు.

నందిగాం: విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వం తీరుకు నిరసనగా శ్రీకాకుళంలో నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ యువజన అధ్యక్షులు చిన్ని జోగారావుయాదవ్ కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, మండల పార్టీ అధ్యక్షుడు తమిరె ఫాల్గుణరావుతో కలిసి మాట్లాడారు. యువతపోరు పోస్టర్లను ఆవిష్కరించారు.

కంచిలి: యువతపోరు నిరసన కార్యక్రమానికి తరలిరావాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పార్టీ నేతలతో కలిసి యువతపోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై నిరసన గళం విప్పడానికి సిద్ధంగా ఉండాలని కోరారు. పార్టీ నేతలు లడ్డు కేశవపాత్రో, కొణపల సురేష్, పలికల జయరాం పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం టౌన్: యువతపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు విజ్ఞప్తి చేశారు. స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. యువతపోరు పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ ఉలాల భారతీదివ్య, సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, పి.సంతు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, కౌన్సిలర్ ప్రేమ్, జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు అవినాష్, ఎస్.ఢిలి పాల్గొన్నారు.